క్లుప్తంగా

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు



నెల్లూరు (వేదాయపాళెం): ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులను గురువారం చేపట్టారు. శీతల పానీయాలు, వాటర్ బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై నాలుగు కేసులు నమోదు చేశామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి, ప్రమాణాలు పాటించని దుకాణాలపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

బాలల న్యాయచట్టంపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (వేదాయపాళెం): బాలల న్యాయచట్టంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య పథకం, జేజే యాక్ట్ – 2015పై గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వర్క్ షాపునకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణకు అనుబంధ శాఖ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా, బాలికలను వ్యభిచార గృహాలకు తరలించడం, భిక్షాటన, డ్రగ్స్ తరలించడానికి బాలలను వాడుకోవడం నేరమన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ప్రొబెషన్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈఓ లక్ష్మి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి సౌజన్య, అనూరాధ, ఇన్‌స్పెక్టర్ రామారావు, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హాజరును మెరుగుపర్చాలి



నెల్లూరు(దర్గామిట్ట): అంగన్‌వాడీల్లో పిల్లల హాజరును మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. అంగన్‌వాడీల ద్వారా జిల్లాలో తల్లీపిల్లలకు అమలవుతున్న పథకాలపై ఐసీడీఎస్ అధికారులతో గురువారం సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. మూడేళ్లు పైబడిన పిల్లలు అంగన్‌వాడీలకు క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బరువు తక్కువగా.. ఎదుగుదలలేని పిల్లలను డాక్టర్లకు చూపాలని పేర్కొన్నారు. ఇలాంటి వారికి అంగన్‌వాడీల్లో అందించే ఆహారంతో పాటు ఇంటి నుంచి మంచి పౌష్టికాహారం లభించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ నూరు శాతం అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ విద్యాధరి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా ఉచిత టీకాలు



మాట్లాడుతున్న మహేశ్వరుడు

నెల్లూరు(సెంట్రల్) : వివిధ రకాల జంతువుల నుంచి మనుషులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు గానూ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి మహేశ్వరుడు పేర్కొన్నారు. ప్రపంచ జూనోసెస్ డేను పురస్కరించుకొని పెంపుడు కుక్కలు, పశువులు ఉన్న వారికి అవగాహన సదస్సును నగరంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జంతువుల ద్వారా మనుషులకు రేబిస్, బ్రూసెల్లోసిస్, తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ సంక్రమిత వ్యాధుల నివారణకు ఇప్పటికే ఉచితంగా టీకాల కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. అధికారులు మాలకొండయ్య, వెంకటరమణ, బీవీ సురేష్, రామచంద్రరావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై విభాగ సింగపూర్ కన్వీనర్‌గా దువ్వూరు

వెంకటాచలం: సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నారై విభాగ కంట్రీ కన్వీనర్లు, అడ్వైజరీ ప్యానల్లను నియమించారు. ఈ మేరకు ఎన్నారై విభాగ సింగపూర్ కన్వీనర్‌గా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలం వెంకటరెడ్డిపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు మురళీకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు.

ప్రమాణాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా..

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆస్తుల విషయమై టీడీపీ నేత లోకేశ్ తనపై అసత్య ఆరోపణలు చేశారని, ఈ వ్యవహారంలో ప్రమాణం చేసే ధైర్యం ఆయనకు ఉందా.. టీడీపీ నేతలు ప్రమాణం చేస్తారో.. లేదో.. వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 15వ డివిజన్ బాలాజీనగర్‌లో గల తుమ్మలకట్ట సంఘం, స్వామిదాస్ స్కూల్ వీధి, ఆంధ్రా బ్యాంక్ వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. లోకేశ్ చేసిన ఆరోపణల్లో 85 శాతం ఆస్తులతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పారు. వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రమాణాన్ని శుక్రవారం చేయనున్నానని తెలిపారు. అసెంబ్లీలో అందరూ ప్రమాణం చేస్తారు.. ఏముందిలే అంటూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడటం తగదని హితవు పలికారు. లోకేశ్ తనపై చేసిన ఆరోపణలు అబద్ధాలని తెలుతాయనే ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. తనపై చేసిన ఆరోపణలు చిన్నవి కాదని, ఇలానే మాట్లాడితే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు ఏ మాత్రం సంపాదించానో తాను చేసే ప్రమాణంతో ప్రజలకు కూడా తెలుస్తుందన్నారు. తాను సమాధానం చెప్పాల్సింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నగర నియోజకవర్గ ప్రజలకు మాత్రమేనని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ గణేశం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణను అందించి క్షేత్రస్థాయిలో వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు, జనాభా, లింగ నిష్పత్తి, కొత్త ఓటర్ల నమోదు, గత ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితా పోలిక, తదితరాలపై దృష్టి సారించాలన్నారు. ఈ నెల 21 నుంచి ఆగస్ట్ 21 వరకు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను గుర్తించి నమోదు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 క్లెయిమ్ ఫారాలను నిర్దీత గడువులోపు పరిష్కరించాలని.. బూత్ స్థాయి అధికారులను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఏఈఆర్వోలు నిర్మలానందబాబా, శ్రీనివాసులు, దేవీకుమారి, మాధవి, దశయ్య, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పునరుద్ధరణకు చర్యలు

శెట్టిగుంటరోడ్డుకు చెందిన మద్దినేని కామాక్షయ్యకు నిలిచిపోయిన పింఛన్‌ను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. తనకొస్తున్న దివ్యాంగుల పింఛన్ కొన్ని కారణాలతో నిలిచిపోయిందంటూ కమిషనర్‌కు కామాక్షయ్య వినతిపత్రాన్ని అందజేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి పింఛన్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (దర్గామిట్ట): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, పార్టీ నేతలు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.



వేదాయపాళెం సెంటర్‌లో..

నెల్లూరు (వేదాయపాళెం): జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య పేర్కొన్నారు. వేదాయపాళెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు దళిత నేతలు నివాళులర్పించారు. నేతలు బద్దెపూడి రవీంద్ర, కామేశ్వరరావు, చిన్నయ్య, పల్లాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ధర్నా

నెల్లూరు సిటీ: కార్మిక వ్యతిరేక చర్యలకు ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ పాల్పడుతున్నారని సిబ్బంది ఆరోపించారు. ఈ మేరకు రెండో రోజూ ధర్నాను చేపట్టారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం, జిల్లా సహాయ కార్యదర్శి కేకే మూర్తి, నెల్లూరు ఒకటో డిపో కార్యదర్శి జయరామయ్య, రెండో డిపో అధ్యక్షుడు ఖయ్యూం, కార్యదర్శి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసు



నెల్లూరు(టౌన్): వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసు నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని విజయవాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసును పలువురు అభినందించారు.

ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలి



కాపు భవనాన్ని పరిశీలిస్తున్న హరినారాయణన్

నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో నిర్మించిన కాపు భవన్‌ను కలెక్టర్ హరినారాయణన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 16న భవనాన్ని ప్రారంభించనున్న తరుణంలో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భవనం లోపల ఏసీలు, జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని.. భవన ప్రాంగణాన్ని చదును చేసి పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలని కాపు సంఘ నేతలు కోరారు. భవనానికి కేటాయించిన మిగులు స్థలం ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బీసీ కార్పొరేషన్ జిల్లా ఏడీ వెంకటయ్య, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ గిరిధర్, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, బలిజ నేతలు పిండి సురేష్, శ్రీనివాస్, భూపతి విజయ, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నాట్యం ద్వారా సింహపురికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేందుకు చిన్నారి భవ్యహాసిని చేస్తున్న యత్నం సఫలీకృతం కావాలని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలోని అష్టలక్ష్మి అమ్మవారి ఆలయ అర్చకుడు కిషోర్‌శర్మ కాంక్షించారు. తిరువణ్ణామలైలో ఈ నెల 16న భవ్యహాసిని నిర్విరామంగా ఐదు గంటల పాటు చేపట్టనున్న 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ సాధనలో భాగంగా అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో నాలుగు గంటల నాట్య ప్రదర్శనను గురువారం నిర్వహించారు.

కుష్టు నిర్మూలనే లక్ష్యం



నెల్లూరు(బారకాసు): కుష్టు నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కుష్టు, ఎయిడ్స్, టీబీ జిల్లా నియంత్రణాధికారి బ్రిజిత పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల పలు ప్రాంతాల్లో వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో కుష్టు వ్యాధి చాలా వరకు తగ్గుముఖం పట్టిందని చెప్పారు. కుష్టు రహిత సమాజం కోసం ఈ నెల 16 వరకు లెప్రసీ కేసులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం ఎన్టీఆర్‌నగర్ యూపీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డీఎస్ఎంఓ సురేంద్రబాబు, నరసింహులు, మల్లమ్మ, ప్రసాద్ ఆచారి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధ్రువీకరణ పత్రాల జారీ



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఖలీల్ అహ్మద్, వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ గతంలో తిరగాల్సి వచ్చేదని, అయితే ప్రస్తుతం త్వరితగతిన అందజేస్తున్నారని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని 42 / 1, 2, 3, 43 / 1, 2 సచివాలయాల ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని 3, 16, 27, 42, 43వ డివిజన్లలో గల 14 సచివాలయాల్లో కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్పొరేటర్ కరిముల్లా, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎమ్మెల్వో కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారి సమద్, తదితరులు పాల్గొన్నారు.

రంగడి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. మార్చి 15 నుంచి గురువారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.10,85,812 మేర సమర్పించారని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, వేదగిరి నృసింహస్వామి దేవస్థాన ఈఓ విరుపావఝుల గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..



మేయర్‌కు వినతిపత్రమిస్తున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మేయర్ స్రవంతికి కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్పొరేషన్ కార్యాలయాన్ని ఈ నెల 20న ముట్టడించనున్నామని తెలిపారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కృష్ణయ్య, సీఐటీయూ నేతలు ప్రసాద్, కుమార్, డీవైఎఫ్ఐ నేత నరసింహ, ఐద్వా నేత పద్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు అశోక్, మూర్తి, ఆనంద్, కృష్ణ, కిరణ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ - ఈలుగా గుర్తించాలని వినతి



ఏఓకు వినతిపత్రమిస్తున్న ఆవాజ్ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మహ్మద్ అనే ఇంటి పేరుంటే కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వడం లేదని, సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆవాజ్ జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా, నజీర్‌బాషా, ఫయాజ్, హుమయూన్, మీరా, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు (వేదాయపాళెం): బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. నగరంలోని సఖి కేంద్రంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు సకాలంలో న్యాయసేవలు, వైద్యాన్ని అందించాలని సూచించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ షెహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేదాయపాళెం పీఎస్‌లో పలు విభాగాల పరిశీలన



నెల్లూరు(క్రైమ్): ప్రాక్టికల్ ట్రెయినింగ్‌లో భాగంగా నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌ను డిప్యూటీ కలెక్టర్ మహేష్ గురువారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, సిబ్బంది విధులు, రికార్డుల నిర్వహణతో పాటు పలు అంశాలను ఇన్‌స్పెక్టర్ నారాయణ వివరించారు. అనంతరం స్టేషన్లోని రిసెప్షన్‌తో పాటు అన్ని విభాగాలను పరిశీలించారు.

వ్యక్తిపై హత్యాయత్నం



నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాల నేపథ్యంలో వ్యక్తిపై సమీప బంధువు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సుబేదారుపేటలోని మధురా స్వీట్స్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన నరేష్‌కు భార్య, పిల్లలున్నారు. ఇటీవల భార్య అలిగి నెల్లూరులోని బంధువుల ఇంటికి రాగా, ఆమె కోసం నరేష్ వచ్చారు. ఈ క్రమంలో మధురా స్వీట్స్ సమీపంలో ఆయన పొట్టలో కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఆయన్ను 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీజేపీ నేతల నిరసన

నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖకు చెందిన ఆలయాల భూమిని అన్యాక్రాంతం చేయడం తగదని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. లీజు ఎవరెక్కువ ఇస్తే ఏ మతస్తులకైనా ఆలయాల భూమిని అప్పగిస్తామంటూ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఇటీవల ప్రకటించడాన్ని ఖండిస్తూ ఆర్టీసీ సమీపంలోని దేవదాయ శాఖ కార్యాలయ ఎదుట నిరసనను గురువారం చేపట్టారు. అనంతరం దేవదాయ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ నేతలు పొట్లూరు శ్రీనివాసులు, దాసరి రాజేంద్రప్రసాద్, నారాయణయాదవ్, మారం కృష్ణ, ఓజిలి సుధాకర్, సురేంద్రబాబు, బెల్లంకొండ రామకృష్ణ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

నెల్లూరు(మినీబైపాస్): జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని మినీబైపాస్ రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కందికట్ల రాజేశ్వరమ్మ, యర్రబోలు రాజేష్, బుజ్జిరెడ్డి, పులిచెర్ల వెంకటనారాయణరెడ్డి, కుడుముల గిరికుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు (వేదాయపాళెం): సంక్షేమ హాస్టళ్లను సక్రమంగా నిర్వహించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్సీ సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి రమేష్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో వార్డెన్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులకు మెనూను సక్రమంగా అమలు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హాస్టళ్లో విద్యార్థులను నూతనంగా చేర్చుకునేందుకు కృషి చేయాలని కోరారు. నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూ హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పాత జిల్లా పోలీస్ కార్యాలయ పక్క వీధిలో నివాసం ఉంటున్న శోభన్‌బాబు, విజయకుమారి దంపతులు కామాటివీధిలో పిండి వంటల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు రాకేష్ వర్ధన్ (20) ఇంజినీరింగ్ మూడో సంవత్సరం వరకు చదువుకొని వ్యాపారంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. శోభన్‌బాబు, విజయకుమారి షాపునకు వెళ్లగా, పాఠశాలకు కుమార్తె వెళ్లింది. ఈ క్రమంలో తల్లికి రాకేష్ వర్ధన్ ఫోన్ చేసి టిఫిన్ తీసుకురావాలని కోరడంతో ఆమె ఇంటికెళ్లారు. తలుపులు తెరిచి ఉండటంతో లోపలికెళ్లిచూడగా, హాల్లోని సీలింగ్ ఫ్యాన్‌కు కుమారుడు ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. దీంతో ఆమె పెద్దగా కేకలేశారు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని రాకేష్ వర్ధన్‌ను కిందికి దించారు. చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతుడి తండ్రి శోభన్‌బాబు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వివాహిత ఆత్మహత్యకు కారణమైన ఆమె భర్తను చిన్నబజార్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామకోటయ్యనగర్‌కు చెందిన షబానా (35)కు మన్సూర్‌నగర్‌కు చెందిన సర్తాజ్ అహ్మద్‌తో పెద్దల సమక్షంలో వివాహమైంది. బంగారు పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించే ఆయన కొంతకాలంగా పని మానేసి ఇంట్లో ఖాళీగా ఉంటూ భార్య, పిల్లలను నిత్యం వేధించసాగారు. నీవు చనిపోతే మరో వివాహం చేసుకుంటానంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో షబానా తన తల్లికి ఫోన్ చేసి చెప్పి బాధపడేవారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త వేధింపులు తాళలేకే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి మమోలా చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

దాడి కేసులో కానిస్టేబుల్..

నెల్లూరు(క్రైమ్): ఆర్‌ఎస్సైపై దాడి కేసులో కానిస్టేబుల్‌ను చిన్నబజార్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌ఎస్సై కేఎస్సెన్ మూర్తి జిల్లా కోర్టు ప్రాంగణంలో గార్డ్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని తనిఖీ చేసేందుకు సోమవారం అర్ధరాత్రి దాటాక వెళ్లారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన సెంట్రీ కానిస్టేబుల్ రమేష్ కనిపించలేదు. చుట్టూ వెతకగా, ఓ పక్కన నిద్రపోతూ కనిపించారు. దీంతో ఆర్‌ఎస్సై ప్రశ్నించి, సెంట్రీ బుక్‌లో రాస్తుండగా ఆగ్రహానికి గురైన రమేష్ కర్రతో దాడి చేసి గాయపర్చారు. ఆర్‌ఎస్సై ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ రమేష్‌ను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.

పోక్సో కేసులో..

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసును నమోదు చేసి గంటలు గడవకముందే నిందితుడ్ని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన సమీపంలో తన ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి పెద్దగా కేకలేయడంతో అక్కడి నుంచి శ్రీహరి పరారయ్యాడు. విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు తమ బంధువుల దృష్టికి తీసుకెళ్లి సంతపేట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ రాజుకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేశారు.